క్లుప్తంగా

108 సర్వీస్‌కు స్థలం కేటాయించండి

గాండ్లపెంట: మండలంలో అత్యవసర సేవల విభాగం 108 సర్వీస్‌కు స్థలం కేటాయించాలని సిబ్బంది సోమవారం తహసీల్దార్ బాబూరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 వాహనం నిలుపుకోవడానికి, ఎమర్జెన్సీ మెడికల్ ఇండెంట్ పెట్టుకోవడానికి, అలాగే సిబ్బంది ఉండటానికి మండలంలో ఎక్కడా రూమ్ కానీ, షెల్టర్ కానీ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. మండలంలో ప్రభుత్వ స్థలం గుర్తించి షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కదిరి అర్బన్: కదిరి కుంట్లపల్లిలో సోమవారం పారిశుధ్య పనులను ఎంపీడీఓ పోలప్ప తనిఖీ చేశారు. గార్బేజ్ వాహనం సకాలంలో వస్తుందా అని గ్రామస్తులను ఆరా తీశారు. ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకెళ్తున్నారా అని అడిగారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా డ్రెయినేజీ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో పాటు పలువురు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: మైలసముద్రం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కపట్నం మండలం బుచ్చయ్యగాపల్లికి చెందిన కూలీలు లక్ష్మీనరసమ్మ, లక్ష్మీదేవి మృతి చెందారు. వెంకటనారాయణమ్మ, వెంకటలక్ష్మమ్మ, చెన్నమ్మ, గంగమ్మ తదితరులు గాయపడ్డారు. మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు గ్రామానికి వెళ్లి పరామర్శించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగమల్లిరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, బట్టల కేశప్ప, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎల్‌ఐసీ చంద్ర పాల్గొన్నారు.

పాడిపరిశ్రమకు చేయూతివ్వండి

ఎన్‌పీకుంట: పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, స్వామిరెడ్డి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అధిక శాతం మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కరువు కాటకాలతో పోరాడుతున్న రైతులకు జీవనోపాధి పొందడానికి ఆవులు, గేదెలు కొనుగోలు చేసుకోవడానికి వడ్డీలేని రుణాలు మంజూరు చేయించాలని కోరారు.

ఏలుకుంట్లలో చోరీ

ధర్మవరం రూరల్: ఏలుకుంట్లలోని గుట్టూరు సల్లప్ప ఇంటిలో రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీ అయ్యింది. ఈ మేరకు బాధితుడు సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దుండగులు చొరబడి బీరువాలోని నగలు, నగదు ఎత్తుకుపోయినట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓ మహిళపై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆటో బతుకు పయనం ఎటో..?



ఆర్టీసీ బస్టాండ్ బయట ప్రయాణికులు లేక వెలవెలబోతున్న ఆటోలు

- గణనీయంగా తగ్గిపోయిన బాడుగలు
- ప్రయాణికుల కోసం తప్పని నిరీక్షణ
- కుటుంబ పోషణ భారమవుతోందంటున్న డ్రైవర్లు

ధర్మవరం అర్బన్: ఆటో డ్రైవర్ల బతుకు పయనం అగమ్య గోచరంగా తయారైంది. ధర్మవరం నుంచి వివిధ పల్లెలకు ఆటోలు నడుపుతున్నారు. మారుమూల ప్రాంతాలకు ఇటువంటి వాటిపైనే ఆధారపడి ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలులోకి వచ్చాక ఆటోలపై తీవ్ర ప్రభావం పడింది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రానికి వచ్చే మహిళలు ఉచిత ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆటోలకు మహిళా ప్రయాణికులు బాగా తగ్గిపోయారు. ధర్మవరం డిపో పరిధిలో 45 ఆర్టీసీ, 25 అద్దె బస్సులు ఉన్నాయి. రోజూ ఈ బస్సుల ద్వారా మహిళా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ఇదివరకు ఆర్టీసీ బస్సుల్లో 30 శాతంగా ఉండే మహిళా ప్రయాణికులు 50 శాతానికి మించిపోయింది.

ఆటోలు ఎక్కే వారేరీ?

ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ బయట దాదాపు 50 మందికిపైగా డ్రైవర్లు ఆటోలు పెట్టుకుని ప్రయాణికులను తరలిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోతే ఆటోల్లోనే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేవారు. ఎక్కువమంది ఆటోల్లోనే గ్రామాలకు వెళుతుండటంతో డ్రైవర్లు అప్పులు చేసి మరీ ఆటోలు తెచ్చుకుని ఉపాధిగా మార్చుకున్నారు. అలా ఒక్కో డ్రైవర్ రోజుకు రూ.1200 సంపాదిస్తే.. అందులో డీజిల్ ఖర్చు రూ.600 పోగా రూ.600 మిగిలేది. ఒక్కోసారి ఎక్కువ ట్రిప్పులు తిరిగితే ఆదాయం పెరిగేది. దీంతో ఆటో డ్రైవర్ ఆటో కోసం చేసిన అప్పులకు కంతులు కట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుని ముందుకు సాగేవారు. ప్రస్తుతం 'స్త్రీ శక్తి' పథకం అమలుతో మహిళా ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణించే పరిస్థితి చాలా వరకు తగ్గిపోయింది. రోజంతా బాడుగలు తిప్పినా.. రూ.300 కూడా రావడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇచ్చేవారు. ఆ సొమ్ముతో ఎంతో ఊరట లభించేది. ప్రస్తుత ప్రభుత్వం అలాంటి పథకాలేవీ అమలు చేయడం లేదు. దీంతో మరింత దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

డీజిల్‌కూ రావట్లేదు



ధర్మవరం నుంచి బసంపల్లి, మైలసముద్రం గ్రామం వరకు ఇదివరకు రోజుకు నాలుగు ట్రిప్‌లు ప్రయాణికులను ఎక్కించుకుని తిరిగేవాళ్లం. ప్రస్తుతం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలు ఎక్కేవాళ్లు ఎవరూ లేరు. దీంతో రోజుకు ఒక్క ట్రిప్ మాత్రమే తిరుగుతున్నాం. డీజిల్‌కు కూడా గిట్టుబాటు కావడం లేదు. ఇలా అయితే ఆటోలు అమ్మేసి కూలి పనులకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. – శ్రీరాములు, ఆటో డ్రైవర్, మైలసముద్రం

లగేజీ బాడుగలే గతి



ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాను. తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆటో తిప్పుకుంటూ డీజిల్ పోను రోజుకు రూ.800 వరకు మిగిలేది. ప్రస్తుతం ఆటోలు ఎక్కే మహిళా ప్రయాణికులు కరువైపోయారు. ఇప్పుడు రోజుకు ఒక్కసారి ధర్మవరం వస్తున్నాం. మహిళలు బస్సులు ఎక్కుతుంటే వారి కుటుంబ సభ్యుల్లోని పురుషులు కూడా అందులోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఏదైనా మూటలు, పైపులు ఇలా లగేజీ ఉండే బాడుగలు మాత్రమే వస్తున్నాయి. – చంద్ర, ఆటో డ్రైవర్, ధర్మవరం

హంద్రీ-నీవా జలాలతో చెరువులను నింపాలి



తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: మండలంలోని చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ మబ్బు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలోని అన్ని గ్రామాల చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపి సాగు, తాగునీటి సమస్య లేకుండా చేశారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టి ఈ ప్రాంత రైతుల పొట్టకొట్టారన్నారు. కాలువకు లైనింగ్ చేయడం వల్ల నీరు ఇంకకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోతాయన్నారు. వెంటనే ప్రతి చెరువుకు కృష్ణా జలాలను మళ్లించాలని కోరారు. లేనిపక్షంలో రైతులు, ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భక్తవత్సలరెడ్డి, సంజీవురెడ్డి, కరే నరేంద్ర, నరసింహారెడ్డి, బీఎస్ నిజాం, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, సూర్యనారాయణ, హరినాథ్‌రెడ్డి, నరసింహులు, అమీర్‌బాషా, రమణ, ప్రకాష్, తాహీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



త్రోబాల్ విసురుతున్న ఉపాధ్యాయులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు కరణ్ స్వరూపాసింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు, మహిళా టీచర్లకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బోధనకే పరిమితమవకుండా వారి మానసిక ఉల్లాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, ముగ్గులు తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నగదు అవార్డులకు ఎంపిక

కదిరి అర్బన్: పదో తరగతి పరీక్షల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఉత్తమ మార్కులు సాధించిన కదిరి ఆర్టీసీ డిపో ఉద్యోగుల పిల్లలు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) నగదు అవార్డులకు ఎంపికైనట్లు డీఎం మైనోద్దీన్ తెలిపారు. డ్రైవర్ రహంతుల్లా కుమార్తె ఆఫ్రీన్, కండక్టర్ రాజశేఖర్ కుమార్తె ధనుశ్రీ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి విజయవాడలో జరిగే సీసీఎస్ మహాసభల్లో ఆర్టీసీ ఎండీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం ఇవ్వనున్నారు.

ఆలయంలో చోరీ

నల్లచెరువు: కమ్మవారిపల్లి సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి అందులోని రూ.50వేలకు పైగా నగదును ఎత్తుకెళ్లారు. చోరీ ఘటనకు సంబంధించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

బత్తలపల్లి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించనున్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఉదయం 9 గంటలకు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి విలేకరులకు తెలిపారు.

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలోని వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి తెలిపారు.

ఎన్‌పీకుంట: మండల కేంద్రం ఎన్‌పీకుంటలోని వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి తెలిపారు.

అన్నదానాలకు పిలుపు

పుట్టపర్తి : మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు అన్నదానాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుక్కపట్నం మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించి, వేడుకలు జరుపుకోనున్నట్లు మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప తెలిపారు.

వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి

కదిరి టౌన్: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సోమవారం పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించాలని తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం చెన్నేకొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి తెలిపారు.

నల్లచెరువు: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం నల్లచెరువు వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి తెలిపారు.

ఓడీచెరువు: మండల కేంద్రం ఓడీచెరువులోని వైఎస్సార్ కూడలిలో మంగళవారం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి తెలిపారు. అలాగే అమడగూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తనకంటి జయప్ప తెలిపారు.

నల్లమాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలిలో మంగళవారం ఉదయం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి తెలిపారు.

● వైభవంగా గణేశ్ నిమజ్జనం



నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడిని చూసేందుకు వచ్చిన భక్తులు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో సోమవారం గణేశ్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ్‌ను నిమజ్జనం చేశారు. మార్కెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 లడ్డూ వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డూను రూ.1,05,016కు గుర్రం రాము దక్కించుకున్నాడు. అలాగే రెండో లడ్డూను రూ.70 వేలకు హర్ష అండ్ టీం దక్కించుకుంది. మూడో లడ్డూ రూ.50వేలకు నితీష్ అండ్ టీం దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా ఉట్టి పోటీలు



రాజేంద్రప్రసాద్ వీధిలో ఉట్టికొడుతున్న దృశ్యం

కదిరి టౌన్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి పట్టణంలోని రాజేంద్రప్రసాద్ వీధి, రెవెన్యూ కాలనీ, మారుతీనగర్‌లో గణేశ్ విగ్రహాల ఎదుట ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. డప్పు వాయిద్యాల నడుమ ఉట్టి కొట్టడానికి యువకులు పోటీపడ్డారు.

ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజలతో కలిసి నాయకులు బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్దకు తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం 'ఆర్డీటీని కాపాడుకుందాం – ఆర్డీటీని రక్షించుకుందాం' అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని 40 గ్రామాలకు చెందిన ప్రజలతో కలిసి ప్రజా సంఘాల నాయకులు ఘాట్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలతకు ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఎరువుల అమ్మకం నిలుపుదల

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎరువు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 5 ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేయగా, రెండు ఎరువు దుకాణాల్లో భౌతిక నిల్వలు, ఈ-పాస్ మిషన్‌లో ఉన్న నిల్వలతో పోల్చి చూసినప్పుడు స్వల్ప వ్యత్యాసాలు గుర్తించారు. రూ.1.05 లక్షల విలువ చేసే 3.65 మెట్రిక్ టన్నుల ఎరువులను తాత్కాలికంగా అమ్మకం నిలుపుదల చేయాలని నోటీసు ఇచ్చారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నల్లమాడ: దొన్నికోటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కట్టుబడి ఆలంసాబ్ కుమారుడు కె.రఫీ (46) అనారోగ్యంతో సోమవారం కదిరిలోని స్వగృహంలో మృతిచెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, ఎస్సీ సెల్ పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులు ఆసాది గంగిశెట్టి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆసాది శంకరప్ప, నాయకులు బాబాఫక్రొద్దీన్, బి. వెంకటశివారెడ్డి, శేఖర, అంజి తదితరులు రఫీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్ల ముట్టడి

ధర్మవరం అర్బన్: వాల్మీకి/ బోయలకు ఎస్టీలుగా రిజర్వేషన్ పునరుద్ధరించాలని ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శి చింతకాయల నరేష్, జిల్లా అధ్యక్షుడు రమేష్, పట్టణాధ్యక్షుడు బాచి తెలిపారు. ధర్మవరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాల్మీకి/ బోయల ఎస్టీ రిజర్వేషన్ అమలు విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ఈ నెల 3న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇళ్లను ముట్టడించనున్నట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకి/ బోయల ఎస్టీ సమస్య మీద నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే వాల్మీకి ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడితో మొదలై అసెంబ్లీ ముట్టడి, ముఖ్యమంత్రి నివాసం ముట్టడి వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నష్టపరిహారం చెల్లించండి

ఓడీచెరువు : జాతీయ రహదారి-716 నిర్మాణంలో ఓడీచెరువు గ్రామ పొలం సర్వే నంబర్ 326, 320లలో భూమి కోల్పోయిన తమకు మార్కెట్ విలువకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అయితే అధికారులు అతి తక్కువగా నష్టపరిహారం ప్రకటించారని, అది ఎంతమాత్రమూ సరైనది కాదన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

ముదిగుబ్బ: స్త్రీ శక్తి పథకం అమలుతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చిందని సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేషు ఆరోపించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ముదిగుబ్బలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాడుగులు తగ్గిపోవడంతో ఆటోలపై చేసిన అప్పులు చెల్లించలేకపోతున్నారన్నారు. వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.25వేలు వెంటనే చెల్లించాలన్నారు.

పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. 2,64,384 మంది లబ్ధిదారులకు రూ.115.68 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదటి రోజు 2,40,886 మందికి రూ.104.77 కోట్లు పంపిణీ చేశారు. తక్కిన లబ్ధిదారులకు రెండవ రోజు మంగళవారం అందజేస్తారని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మొదటి రోజు కలెక్టర్ చేతన్ పుట్టపర్తి మండలం పెడపల్లిలో లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు.

ప్రమాదాలు అరికట్టాలి

ఓడీచెరువు: మండలంలో కొత్తగా నిర్మించిన నేషనల్ హైవేలోకి ప్రవేశించే సర్వీస్ రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించడానికి ఆర్‌అండ్‌బీ వారు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజినేయులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అశ్వర్థప్ప, అంజనప్ప, సురేష్, చలపతి, మేకల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి



తలమర్ల సంజీవరెడ్డి

పుట్టపర్తి టౌన్: చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి.. బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్రావతి బ్యూటిఫికేషన్‌లో భాగంగా నదిని పూడ్చి గార్డెన్ పేరుతో కూటమి ప్రభుత్వం నది ఆనవాళ్లు లేకుండా చేస్తోందన్నారు. గతంలో ఎగువ కురిసిన వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించి పుట్టపర్తిలోని పలు ప్రాంతాల్లోకి నీరు చేరిన విషయాన్ని గుర్తు చేశారు. నదిని పూడ్చి గార్డెన్ ఏర్పాటు చేస్తే నదిలో నీరు ముందుకు పోవడానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. భవిష్యత్‌లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చిత్రావతి నది పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. అలాగే పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తులకు స్నానపు గదులు, టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రజాగ్రహంతో తగ్గిన సర్కార్

బత్తలపల్లి: దివ్యాంగుల పింఛన్ల రద్దు కుట్ర నేపథ్యంలో ప్రజాగ్రహం పెల్లుబకడంతో కూటమి ప్రభుత్వం వెనక్కు తగ్గిందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి తెలిపారు. సోమవారం ఆమె బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్లు తొలగింపునకు ప్రభుత్వం చేసిన కుట్రను తాము మొదటి నుంచి ఖండిస్తున్నామన్నారు. ఈ పోరాటంలో మీడియా, వైఎస్సార్‌సీపీ నాయకులు, పలు ప్రజా సంఘాలు, కమ్యూనిస్టులు దివ్యాంగులతో కలిసి పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి పింఛన్లు పంపిణీ చేసిందన్నారు. రీ-వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగులను అనర్హులుగా చిత్రీకరించి వారికి నోటీసులు పంపించి పింఛన్లు తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. అయితే ఈ అన్యాయాన్ని మీడియా ద్వారా ఎండగట్టడంతో చెక్ పడినట్లయిందన్నారు. దీంతో ఆక్రోశం పట్టుకోలేక కూటమి నాయకులు 'సాక్షి' మీడియాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ రోజు పింఛన్ల పంపిణీ జరిగిందంటే ప్రతిపక్షాల పాత్ర ఎంత ఉందో సాక్షి మీడియా పాత్ర కూడా అంతే ఉందన్నారు.

రామానాయునికుంటలో నిమజ్జనం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని ఉన్న భారీ వినాయక విగ్రహాలను మంగళవారం కదిరి ఎంపీడీఓ కార్యాలయం వెనకనున్న రామానాయునికుంటలో నిమజ్జనం చేయనున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందు కోసం కుంట వద్ద చదును చేసి.. బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విగ్రహాలతో పాటు చిన్న పిల్లలను తీసుకురాకూడదన్నారు. పట్టణంలో ఉన్న విగ్రహాలను ఉదయం 10.30 గంటలకు రైల్వేస్టేషన్ వద్దకు తీసుకురావాలని, అంబేద్కర్ సర్కిల్‌లో ఖాద్రీశుని వినాయకునికి 1 గంటకు పూజాకార్యక్రమంతో ప్రారంభమవుతుందని, దాని వెంట అన్ని విగ్రహాలు వెళ్లాలని సూచించారు. రాత్రి 10 గంటలకు నిమజ్జనం పూర్తి చేయాలని పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

భారీ బందోబస్తు..

కదిరిలో మంగళవారం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 300 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, వందమంది స్పెషల్ పార్టీ ఏపీఎస్‌పీ సిబ్బంది, వంద మంది హోమ్ గార్డులతో భారీ బందోబస్తు నడుమ నిమజ్జనం జరుగుతుందని తెలిపారు.

'రాహుల్ క్షమాపణలు చెప్పాలి'

ధర్మవరం అర్బన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో సోమవారం వారు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నిరసన ర్యాలీ చేశారు.

ఘనంగా ఎల్‌ఐసీ వార్షికోత్సవాలు

కదిరి టౌన్: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) 69వ వార్షికోత్సవాలు సోమవారం కదిరి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ శివనారాయణస్వామి హాజరై మాట్లాడారు. ఎల్‌ఐసీ ఆవిర్భాం.. సేవల గురించి వివరించారు.